# మందు కథ

# మందు కథ

మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ముకుందరావు సెంట్రల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సన్యాసిరావు... మెడికల్ రిప్రజంటేటివ్ మోహన్‌రావు... అడ్వకేట్ అహోబలరావూ బార్ మేట్సు:

పై నలుగురునీ ఒక టేబులుచుట్టూ కలిపింది మోతీబార్.

స్నేహం అనేక రకాలు: అన్నిటిలోనూ మందు స్నేహం గొప్పది!! మందు మజాలో మస్కా కొట్టచ్చు, కాకా పట్టచ్చు.. ఎంతో దగ్గరవచ్చు... తిట్టుకోవచ్చు... కొట్టుకోవచ్చు డబ్బు అప్పు అడగవచ్చు.. బిల్లు (బారు) చెల్లించమనచ్చు... ఇంకా

శృతిమించి తాగితే ఇళ్ళల్లో ఆడవాళ్ళ గురించి... భగ్న ప్రేమ గురించి, ఇంకా ఎన్నో విషయాలు మతి లేకుండా మాట్లాడచ్చు.

ప్రతిరోజూ సాయంత్రం ఆరుకొట్టే సరికి పై నలుగురు మోతీబారుకొచ్చి రూఫ్ గార్డెన్లో కూర్చుంటారు.

ఒకరితో మరొకరికి పరిచయం లేనప్పుడు ఎవరిష్ట మొచ్చిన మందు వాళ్ళు తాగేవాళ్ళు!

పరిచయం పెరిగి స్నేహంగామారేక నలుగురూ కల్సి ఒకే రకం మందుకొట్టాలని తీర్మానించుకున్నారు.

నలుగురూ నాలుగు రకాల అభిరుచులున్న వ్యక్తులు! వృత్తి హోదా వేరయినా ఏకాభిప్రాయానికి రాగల సంస్కార వంతులు.

నలుగురూ తాగుబోతులేం కాదు. అయితే మందుకు ఎందుకు అలవాటుపడ్డారో చెప్పాలీ అంటే ఒక్కొక్కరికి ఒక్కో కారణం వుంది. రీజనుంది!!

ముకుందరావుది గొప్ప డిపార్టుమెంటు. లారీ ఓనర్లు ప్రయివేటు బస్సు ఓనరులూ, బాగా ముట్ట చెప్పూ రోజుకొకరు హైక్లాస్ పార్టీకి ఆహ్వానించటం మొదలుపెట్టేరు. ముకుంద రావు తన జేబులోంచి డబ్బుతీసి ఖర్చుపెట్టాల్సిన అవసరం వుండేది కాదు. తనడబ్బు కాకపోతేసరి ఎంతయినా తాగుతాడు. అంత మాత్రాన మనిషి పిసినారేం కాదు. కాకపోతే స్వంత డబ్బుతో మందుకొట్టటం అలవాటయితే తానెక్కడ ఆరిపోతాడోని భయం అంతే!

సన్యాసిరావు ప్రొహిబిషన్ డిపార్టుమెంటు ఆఫీసరవటంతో సిటీలో ఏ బారుకెళ్ళినా పై సాఛార్జీ చెయ్యరు. పైగా యిస్సనాలే గానీ కావలసినన్ని, గోతాలకెత్తి ఇంటికి పంపిస్తారు డీలర్లు — అంచేత హాబీగా పుచ్చుకోవటం ప్రారంభించిన సన్యాసిరావుకి మందు అలవాటుకింద పరిణమించింది. అయినా ఖాతరు చెయ్యాల్సిన అగత్యం లేదతనికి. ప్యూర్ ఇంపోర్టెడ్ సరుకైనాసరే తెప్పించుకు తాగగల సత్తావున్న వాడు—పై పెచ్చు ఇంకా పెళ్ళి చేసుకోకుండా భీష్మించుకు కూర్చున్న ఘోటక బ్రహ్మచారి.

సన్యాసిరావు వూండెడ్ సోల్జర్: కాలేజ్ డేస్‌లో ఓ ముద్దుగుమ్మని ప్రేమించేడు. ఆ అమ్మాయి కూడా యిస్సంది. ఇద్దరూ కల్సితిరిగేరు — తీరా ముద్దుగుమ్మ ఫాదర్ వార్నింగిచ్చాడు. అందుకెంతమాత్రం భయపడని సన్యాసిరావు ముద్దుగుమ్మని లేపుకెళ్ళి పెళ్ళి చేసుకుందుకు సిద్ధపడ్డాడు. ముద్దుగుమ్మ ససేమిరా అందుకొప్పుకోలేదు. తండ్రిమాట కాదనలేక మరొకడ్ని పెళ్ళిచేసుకుంది. అప్పట్నించి మందు అలవాటయింది సన్యాసిరావుకి. ఇది పది హేనేళ్ళనాటి కథ!

మెడికల్ రిప్రజంటేటివ్ మోహన్ రావు విలాస పురుషుడు! మనిషి ఎప్పుడూ టిప్‌టాప్‌గా నీట్‌గా వుంటాడు. బాగా డబ్బున్న మనిషి.

ఇంగ్లీషు మందుల కంపెనీలో వుద్యోగం. శాంపిల్ బాటిల్సు టానిక్ సీసాలు, కాప్సిల్సు టాబ్లెట్సు మందుల షాపు వాళ్ళకి అమ్మేసి డబ్బుచేసుకునే తెలివి తేటలున్నయ్. తద్వారా

వచ్చిన ఇన్కమ్ అతని పాకెట్ ఖర్చుకి అవలీలగా సరిపోతుంది.

కొన్నాళ్ళక్రితం వరకూ మందు అంటే హడలిపోయి ఆమడదూరం పరుగెత్తేవాడు.

అలాంటిది... వన్ ఫైన్ నైట్ మందు పుచ్చుకోవాల్సి వచ్చింది.

వైజాగ్ కేంపు వెళ్ళాడు. ఖరీదైన హోటల్లో మకాం పెట్టేడు. అదృష్టవశాత్తూ అతని పక్కరూములో ఓ ఆంగ్లో ఇండియన్ గరల్ బసచేసింది.

ఇద్దరిచూపులు గ్లాసులు, పెదాలూ ఆరాత్రే కలిశాయి. ఆరాత్రే ఆంగ్లో ఇండియన్ గరల్ హాఫ్ బాటిల్ పైగా ఫూడ్చేసింది. అమ్మాయి మైకంలోపడి ఆమె బలవంతం చేసిన కారణంగా మోహన్ రావు కూడా పుచ్చుకోవలసి వచ్చింది.

ఆ క్షణంనుంచీ అమ్మాయికీ మందుకీ దగ్గరయ్యాడు. దాసుడయ్యాడు. ఆంగ్లో ఇండియన్ గరల్ని మేరేజ్ చేసుకున్నాడు.

ఇక మిగిలిందల్లా అహోబలరావు.

అహోబలరావు జీవితంలో దెబ్బతిన్న మనిషి. భార్య మీద అనుమానం ఎక్కువ. పెళ్ళి చేసుకున్న తర్వాత తెల్సుకోగలిగేడు మరెవరితోనో భార్యకు అక్రమ సంబంధం వుండేదీ అని.

భార్యని అనుమానించినా శిక్షించలేని బలహీనతకు లొంగిపోవటం ఇష్టంలేక, బాధ మర్చిపోయేటందుకు మందు అలవాటు చేసుకోవలసి వచ్చింది.

ఆరోజు సాయంత్రం మామూలు వేళకి ముకుందరావు తప్ప మిగతా ముగ్గురు బారు చేరుకున్నారు.

అలవాటు ప్రకారం బేరర్ వచ్చి ఫుల్ బాటల్ విస్కీ వాళ్ళముందు పెట్టి స్పెన్సర్ సోడాలు ఐస్ క్యూబిక్సు తెచ్చేందుకు వెళ్ళాడు.

"సారీ ఫ్రండ్స్! ఐ యామ్ లేట్..." వస్తూనే క్షమాపణలాంటిది చెప్పేడు ముకుందరావు.

"మన నలుగురిలో ఏ ఒక్కరు రాకపోయినా బాటిల్ ఓపెన్ చెయ్యమనే నిజం మీకూ తెల్సుగా..." అంటూ నవ్వేడు సన్యాసిరావు.

"ఆలస్యమైతే సీసాలోవున్న విస్కీ కూడా విషంగా మారిపోతుంది. డిలే ఎందుకూ?... బాటిల్ ఓపెన్ చెయ్యండి." మోహనరావు మాటల్లో అసహనం తొందర వ్యక్తమైంది.

కార్కు ఓపెన్ చేసి గ్లాసుల్లో విస్కీ పోశాడు అహోబలరావు.

ఛీర్స్ చెప్పుకున్నాడు.

"మిస్టర్ ముకుందరావు! యెప్పుడూ ముందుగా వచ్చే మీరు ఈరోజు ఆలస్యంగా వచ్చారూ అంటే ఏదో కారణం ఉండి ఉండాలి" ఓ సిప్పు లాగించిన అహోబలరావు లా పాయింటు తీస్తూ అడిగేడు. "ఇక్కడికనే బయలుదేరాను. కానీ, అనుకోకుండా యాక్సిడెంట్ కేసొకటి అర్జెంటుగా ఎటెండవాల్సి వచ్చింది.

లారీవాడు బాగా తాగివున్నాడేమో ఆర్టీసీ బస్సుని గుద్దేశాడు. ఎవరికీ ప్రమాదం జరగలేదు. రెండు వెహికల్సూ బాగా డేమేజ్ అయినయ్, అంతే! అక్కడికెళ్ళి రిపోర్టు తయారు చేసి వచ్చేసరికి లేటయింది. సార్'' జరిగిన విషయం వివరంగా చెప్పేడు ముకుందరావు.

"అక్కడ బళ్ళు డేమేజి ఇక్కడ మా ఆలోచన్లు డేమేజ్. అంతే కదా" సిగరెట్ వెలిగిస్తూ అన్నాడు సన్యాసిరావు.

పాలిటిక్స్ గురించి. రాబోయే ఎలక్షన్ల గురించీ, ఓటు హక్కు గురించీ, బ్లాక్ మార్కెట్ గురించి సినీమా యాక్టర్ల గురించి ప్రొహిబిషన్ గురించి స్త్రీ స్వాతంత్ర్యం గురించి కేబరా డేన్సు గురించీ యిలా అనేక విషయాల గురించి నలుగురూ మాట్లాడుకున్నారు.

ఓ గంట గడిచింది!

మోహన్ రావు, ముకుందరావూ ఏదో పనుందని చెప్పి తప్పుకు వెళ్ళిపోయారు.

టేబిల్ ముందు మిగిలిందల్లా సన్యాసిరావు. అహోబలరావు మాత్రమే.

"ఈరోజు చాల బేడ్ డే! తాగేక అంతా ఒక్కసారే విడిపోవాల్సొం. అలాంటిది వాళ్ళు ముందే జారుకున్నారు. ఇంకా బాటిల్లో సగం విస్కీ అలాగే వుంది. దాన్ని మనిద్దరమే పట్టాలి. ఈజిట్ పాజిబుల్...'' సన్యాసిరావు డౌట్ వెలిబుచ్చాడు.

"ఎప్పుడూ లేనిది ఈరోజు కోర్టులో కేసొకటి ఓడి పోయాను. నా మనస్సంతా అల్లకల్లోలంగా వుంది. నాకు పీకల వరకూ తాగాలన్పిస్తోంది ఇప్పుడు" కసిగా అన్నాడు అహోబల రావు చెమట పట్టిన ముఖాన్ని కర్చీఫ్‌తో అద్దుకుంటూ. "ఇఫ్ యు డోంట్ మైండ్ మీరు ఓడిపోయిన కేసు వివరాలు తెలుసు కోవచ్చా" కుతూహలంగా అడిగేడు సన్యాసిరావ్.

"అది చాలా చిత్రమైన కేసు. భర్త తాగుబోతు. అతని బలహీనతని తెలుసుకున్న భార్య తనకు ఇష్టమైన వాడితో తిరగాలని ప్లాన్ చేసింది. ఆ ఇష్టమైన వ్యక్తి ఆమె భర్తకి స్నేహితుడే. తన అభిప్రాయాన్ని ఆమె అతనితో చెప్పింది. ఫ్రెండు భార్య మాట విన్న అతను నివ్వెరపోయాడు. అతను 'నో' అన్నాడు. ఆమె మరో అడుగు ముందుకొచ్చింది. అతడ్ని బలవంతం చేసింది. ఆల్మోస్ట్ అతడ్ని రేప్ చేసిందామె" చెప్తూ చెప్తూ ఆగిపోయాడు అహోబలరావ్.

"ఆమె ఆడదికాదు ఘాతకి" పెద్దగొంతుతో అరిచినట్టే అన్నాడు సన్యాసిరావు.

"నో! షి ఈజ్ రైటంటాను. భర్త తాగుబోతే కాదు. చేతగానివాడు కూడా! అందుకే ఆమె అలాంటి నిర్ణయం తీసు కోవాల్సి వచ్చి వుంటుంది. ఆమె మాత్రం మనిషి కాదా! ఆమెలో కూడా కోరికలు వుండవా? ఉప్పు కారం తింటున్న మనిషి కాదా ఆమె?"

"అలాంటప్పుడు భర్త నుండి ఆమె విడాకులు తీసుకుని ఉండాల్సింది. బట్ ది సీజ్ టూ మచ్."

"విడాకులు ఇచ్చేందుకు భర్త వప్పుకోలేదు. ఏమీ చెయ్యలేని నిస్సహాయురాలయిందామె గౌరవప్రదమైన కుటుంబంలో ఉన్నతమయిన స్థానంలోవున్న ఆమె.... బజార్న పడలేకపోయింది. గుట్టుగా రహస్యంగా దాహం తీర్చుకోవాలనుకుంది. ఐసే! షి ఈజ్ రైట్! ఆమె చేసిన పనిలో తప్పేమీ అవుపించలేదునాకు" గ్లాసులో సగానికి పైగా వున్న విస్కీ గట గటా తాగేసాడు అహోబలరావ్.

"మరి మన సాంప్రదాయం ధర్మశాస్త్రం మాటేమిటి? ఆడది బరితెగించి ప్రవర్తించకూడదు కదా!"

"మగాడు రేప్ చేస్తే అదొక ఘనకార్యం. అదే ఆడది చేస్తే! మనమంతా నిందిస్తాం. ముక్కు మీద వేలేసుకుంటాం అందుకే మగాడికో రూలు ఆడదానికొక రూలు ఎందుకంటాను! తప్పు ఎవరుచేసినా తప్పే. నేనయితే భార్య అంతర్యాన్ని తెలుసుకున్న తర్వాత హాయిగా ఆమెకి డయివర్సు ఇచ్చేవాడ్ని. లేకుంటే నాభార్యని నాఫ్రెండుకిచ్చి ఆనందంగా మేరేజ్ చేసి ఉండి ఉండేవాడిని" ఉద్వేగంగా అన్నాడు అహోబలరావు.

"మనం ఇండియాలో ఉంటున్న మనుష్యులం సార్! మీ నిర్ణయాన్ని అందరూ హర్షించరు. మనది ఖర్మభూమి.."

"అందుకే స్త్రీకి స్వాతంత్ర్యం రక్షణ లేకుండా పోయింది, ఈ పవిత్ర భారత దేశంలో" వెటకారంగా నవ్వేడు.

అహోబలరావు తాగుతూనే వున్నాడు మాట్లాడుతూనే వున్నాడు.

ఎప్పుడూ లేనిది ఈరోజు అహోబలరావు తాగుతున్న తీరు చూసి బెదిరిపోతున్నాడు సన్యాసిరావు.

మిగిలిన విస్కీని ఎక్కువ భాగం అహోబలరావే పూదేశాడు.

మోతాదు మించి పుచ్చుకోవా లన్పించలేదు సన్యాసిరావుకి. అందుకే కాస్త కాస్త చేదుమందు పుచ్చుకుంటున్నట్టుగా గుటకేస్తున్నాడు.

ఖాళీ సీసాకేసి సీరియస్‌గా చూచిన అహోబలరావు బేరర్ని కేకేసి మరో బాటిల్ ఆర్డరిచ్చాడు.

"ఇప్పటికే మనం టార్గెట్ దాటి తాగినట్టున్నాం. ఇక నేను తాగలేను—మీరూ తాగటం మంచిది కాదేమో?" నసిగేడు సన్యాసిరావు.

"నిండా మునిగిన వాడికి చలేమిటి? నేనెట్లాగూ చెడిపోయాను. నువ్వూ చెడిపోవాలి తప్పదు."

"అంటే!" నివ్వెరపోయి అడిగేడు.

"నాతోపాటు నువ్వూ పుచ్చుకోవాలి. అంతే—"

"మీరు మరికొంచెం పుచ్చుకుంటే సవ్యంగా ఇల్లు చేరుకోగలరాని..."

"ఆ భయం మీకక్కరలేదు. నా మిసెస్‌కి చెప్పే వచ్చాను. మోతాదు మించినా ఫర్వాలేదు... కేసు ఓడిపోయిన బాధ మర్చిపోగలిగేటంత వరకూ తాగాలి! అండర్‌స్టాండ్!!—"

బేరర్ మరో క్వార్టర్ బాటిల్ తెచ్చి ముందుంచాడు. అహోబలరావ్ ఓపెన్ చేసుకుని ద్రవాన్ని గ్లాసులో వొంపుతున్నాడు.

మనిషి మత్తులో వూగిపోతున్నా... మందు పట్టిస్తూనే వున్నాడు.

మరికొంచెం పుచ్చుకునేటందుకు ఇబ్బంది ఫీలవుతున్నాడు సన్యాసిరావు.

"మీరలా బుద్ధావతారం తాలిస్తే ఐ డోంట్ లైక్! కమాన్ !!— హేవ్ సమ్మోర్..." ఆర్డరు జారీ చేశాడు అహోబలరావు.

"ముందు మీరు కానివ్వండి!..."

"ఆడదాని విషయంలో మనం ఆఫ్టాల్ అనుకోకూడదు. రాజ్యాలు కూలిపోవటానికి...పాండవులు ఓడిపోవటానికీ స్త్రీ ముఖ్యకారణం— భార్యాభర్తలు ఒకరినొకరు నమ్ముకుని బ్రతకటం కేవలం కట్టుబాటు! ఒకరికి తెలీకుండా మరొకరు చాటు మాటు వ్యవహారాలు సాగించటం నేరం. ముసుగులో గుద్దులాట బావుండదు. వద్దనుకున్నప్పుడు విడిపోవడం సబబు!— ఏమంటారు?—" మూతబడుతున్న కనురెప్పల్ని విప్పార్చుకు చూస్తూ బుల్లి ఉపన్యాసం ఇచ్చాడు అహోబలరావు.

క్షణం గడుస్తున్నకొద్దీ అహోబలరావు అవుటయిపోతున్నాడనే విషయం సన్యాసిరావు గమనిస్తూనే వున్నాడు.

ఇన్నాళ్ళబట్టీ అహోబలరావుతో తనకు స్నేహమున్నా అతనింటికి ఎప్పుడూ వెళ్ళలేదు సన్యాసిరావు. ఆ అవసరమూ కలగలేదు.

మరో రెండు లాగించాలని అహోబలరావు ఆరాట పడుతున్నాడు. విస్కీగ్లాసులో వొంచుకోబోయి టేబిల్ మీద పారేశాడు. మనిషి జావగారి పోతున్నాడు.

ఇక ఎక్కువసేపు బార్లోనే వుండటం భావ్యంగా తోచలేదు సన్యాసిరావుకి.

అహోబలరావుని పొదివి పట్టుకొని బారులోంచి బయటికి నడిపించాడు సన్యాసిరావు.

ఆటో బేరమాడేడు.

నాలుగయిదుసార్లు అడగంగ అడగంగా ఏవో గుర్తులు గొణుగుతూ చెప్పేడు అహోబలరావు.

రెండు మైళ్ళుపోయాక నాలుగయిదు సందు మలుపులు తిరిగి ఓ ఇంటి ముందు ఆగింది ఆటో.

తాను ముందుదిగి అహోబలరావుని మెల్లగా చెయ్యి పట్టుకు దించి యింటి తలుపు తట్టేడు సన్యాసిరావు.

తలుపు తెరుచుకుంది.

భర్త పరిస్థితి గమనించి "ఏమయింది వారికి" తడబడుతూ అడిగింది.

"బెడ్ రూం వేపు నడిపించండి. అటు ఆ! అదే" సన్యాసిరావుకి దారిచూపింది అనూరాధ.

"ముందు మీరు వెళ్ళి ఓ గ్లాసు మజ్జిగ పట్రండి" అంటూ బెడ్ మీద అహోబలరావుని పడుకోబెట్టాడు.

మరో నిముషంలో మజ్జిగ గ్లాసుతో బెడ్ రూంలో కొచ్చింది అనూరాధ.

గ్లాసు అందుకోబోతూ లైటు వెలుగులో అనూరాధ ముఖంలోకి చూచిన సన్యాసిరావు స్తంభించిపోయాడు.

సన్యాసిరావు చేతిలో గ్లాసుజారి నేలమీద పడ్డది.

అనూరాధ కంగారు పడ్డది.

పదేపదే ఆమె ముఖంలోకి చూస్తూన్న సన్యాసిరావు మస్తిష్కంలో గతం మెదలసాగింది.

తనను కాదని అనూరాధ అహోబలరావుని చేసుకున్న దన్నమాట.

ఇది కలా నిజమా అన్పించింది. అనూరాధని కళ్ళతో చూడగల అవకాశం వస్తుందని అనుకోలేదు.

అలాంటిది తలవని తలంపుగా ఒకనాటి తన ప్రేయసిని కళ్ళతో చూడగలిగేడు.

అనూరాధమీద కోపం అసహ్యం ఇంకా ఎన్నో సన్యాసిరావులో ఒక్కసారిగా కలిగాయి.

తనను వంచించిన అనూరాధ మళ్ళీ అవుపిస్తే ఘోరంగా పరాభవించాలనుకున్నాడు.

అలాంటిది ఇప్పుడు అనూరాధ తన ఫ్రెండు భార్య అని తెల్సి ఏమీ చెయ్యలేని స్థితిలో ఉండిపోయాడు.

"ఈ జన్మలో నిన్ను మళ్ళీ చూస్తాననుకోలేదు- నీ కోసం ఇంకా బ్రహ్మచారిగానే ఉన్నాను. నిన్నే ఆరాధిస్తూ నీకే అంకితమైపోయిన నేను వంటరి జీవితాన్ని గడుపుతున్నాను."

అనూరాధ ముఖంలో రంగులు మారుతున్నాయి.

"ఈ క్షణంలో నిన్ను ఏమయినా చేయగలను. నీభర్త తాగిన మైకంలో బెడ్ మీద ఉన్నాడు. ఈ ఇంట్లో నీవు వంటరి దానవు. నేనూ తాగివున్నాను. తాగినవాడు మానభంగాలు, హత్యలు చేయగలడు. అయినా నువ్వు నా ఫ్రెండు భార్యవై నావు గనుక నిన్ను ఏమీ చెయ్యలేక పోతున్నాను. యింకా ఇక్కడేవుంటే నా మనస్సెలా మారుతుందో అందుకే మళ్ళీ ఈ గడప తొక్కను. వెళ్ళిపోతున్నాను" అంటూ ఉద్వేగంగా మాట్లాడిన సన్యాసిరావు పెద్దపెద్ద అంగలేసుకుంటూ బయటికి వెళ్ళిపోయాడు.

"నీలాంటి మంచిమనిషి నూటికొక్కరు కూడా ఉండరు. ఉండరు" గొణిగింది అనూరాధ.

వీధి తలుపు గడియపెట్టి వచ్చిన అనూరాధ బెడ్ రూంలోకొచ్చి ఫాను స్విచ్ వేసి అచేతనంగా భర్త బెడ్ పక్కగా ఉన్న సోఫాలో కుప్పకూలిపోయింది.

(మే 80 ప్రభవ మాసపత్రికలో ప్రచురితము.)

★

*Made out of the Finest Materials*

**MANGALORE**
**GANESH**
**BEEDIES**

*Smokers Cannot afford to miss them*

**DAILY SALES 8 CRORE BEEDIES**

★

*HEAD OFFICE:*

**Mangalore Ganesh Beedi Works**

**VINOBA ROAD : MYSORE - 570005**

Grams : **'AROMA'.**

Telephone : **20241**